# దొరకని దోషి

సీతాపతి కళ్ళమ్మట నీళ్ళెట్టుకున్నాడంటే జాలేసింది. 'జీవితంలో నేనే ఓడిపోయాను మంగళా' అని మంగళ ఎదుట ఆడపిల్లలా ఏడ్చాడట.

"ఆడాళ్ళ కన్నీళ్ళు చూస్తేనే భరించలేను. చెట్టంత మగాడు కన్నీళ్ళు పెట్టుకోవడం చూస్తే నాక్కూడా కళ్ళనీళ్ళు తిరిగాయి. పాపం ! సీతాపతిని చూస్తే జాలేస్తోంది" అంది మంగళ.

మంగళకేకాదు నాకూ అతనిమీద విపరీతమైన జాలేసింది. అసలు యిలాటి పరిస్థితిని మేమెప్పుడూ ఊహించలేదు. ప్రేమించి పెళ్ళిచేసుకున్న సీతాపతికి, ఆ జీవితం నరకకూపంగా మారుతుందని ఏకోశానా ఊహించలేదు. మంగళ కూడా వూహించి వుండదు.

సీతాపతి అలకను ప్రేమించాడు. యూనివర్సిటీలో చేరిన తొలి రోజుల్లోనే వాళ్ళిద్దరికీ పరిచయం ఏర్పడింది. రెండేళ్ళపాటు వాళ్ళు వోపికపట్టి తర్వాత పెళ్ళి చేసుకున్నారు. ఈ వివాహంలో నాకూ, మంగళకూ, మరో అమ్మాయి సరస్వతికీ చాలా ఎక్కువ పాత్రే వుంది. ఈ వివాహాన్ని మొదట లాంఛనంగా సింహాచలం కొండమీద జరిపించింది కూడా మేమే. ఆ తర్వాత వాళ్ళ వాళ్ళు తప్పనిసరై మరో గత్యంతరంలేక వేదోక్తంగా యింటి దగ్గర జరిపించారు.

ఈ వివాహాన్ని జరిపించడంలో నేనుకూడా ముఖ్యమైన పాత్ర వహించి నందుకు ఎంతగానో గర్వపడుతుంటాను. చాలా మందికి యీ విషయాన్ని సగర్వంగా చెప్పుకున్నాను. ఎందుకంటే యీ వివాహం అనేక విధాలుగా అభ్యుదయ వివాహం. ఆర్థికంగానూ, సాంఘికంగానూ యిద్దరిమధ్యా చాలా

లేడావుంది. కులాలూ, ప్రాంతాలూ వొకటికావు. ఇటువంటి వివాహానికి నామట్టుకునేను ఉడుతాభక్తిగా తోడ్పడ్డందుకు గర్వంగా వుండేది!

కాని యిప్పుడు మంగళ చెప్పిన విషయాలు విన్నతర్వాత ఆ గర్వం కాస్తా ఎగిరిపోయింది. పరిస్థితి ఎందుకు యిలా మెలికలు తిరిగిపోయిందో నాకు అర్థం కాలేదు.

మంగళ చెప్పడం మాత్రం తప్పంతా అలకదే అంది. "నెలరోజుల క్రితం విశాఖపట్నం వెళ్ళాను. అలకను చూసొద్దామని యింటికి వెళ్తే లేదు. కాలేజీనించి రాలేదట. సీతాపతిగారొక్కరే వున్నారు. చాలా సేపు మాట్లాడుకున్నాం. చాలా దిగులుగా కనిపించారు. వాళ్ళిద్దరికీ సరిపడడంలేదని ఆ మధ్య ఒకటి రెండుసార్లు విన్నాను. ఆ విషయం కదిపితే ఆయన కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు.

ఈ నాలుగేళ్ళలోనూ జరిగిన సంఘటనలెన్నో చెప్పుకొచ్చారు. అలక యింతగా మారిపోయిందంటే నాకే ఆశ్చర్యంగావుంది అంది" మంగళ.

ఇంతకీ జరిగిన సంఘటనలేమిటో నాకు తెలీలేదు. అయితే సీతాపతి కళ్ళనీళ్ళు పెట్టుకొనే పరిస్థితి వచ్చిందంటే యిదెంత సీరియస్ విషయమో అర్థమౌతూనేవుంది. సీతాపతిది చాలా సున్నితమైన మనస్సు. ఏ మాత్రం కష్టాన్నీ సహించలేడు. చదువుకొనే రోజుల్లో అతను పువ్వులంటే మోజుపడి రోజూ కొనుక్కోవడం; ప్రేయసిమీదా, ప్రకృతిమీదా, వెన్నెలమీదా కవిత్వం అల్లడం చూసి తోటి మిత్రులు ఎగతాళి చేసేవారు. ఈ రోజుల్లో ఆడాళ్ళు కూడా నీలా సున్నితంగా వుండరోయ్ అని. అంత మెత్తని మనిషికి పాపం ఎంత యిబ్బంది వచ్చిపడింది!

సీతాపతిని గురించి మంగళని అడిగి వివరంగా తెలుసుకుంటే బావుండును. కాని అంత తీరిక ఆవిడకి లేదు.

ఆరోజు బెంగుళూరునుంచి వస్తూ హైదరాబాదులో బండి బయలుదేరడానికి యింకా చాలా టైము వుందికదాని వూళ్ళోకొచ్చి నన్ను వెతుక్కుంటూ మా ఇనిస్టిట్యూట్ కు వచ్చిందిమంగళ. బండికిఅట్టే టైములేదు. హడావుడిపడుతూ వెళ్ళిపోయింది. వెళ్ళేముందు "సీతాపతిని గురించి వివరంగా పుత్తరం రాయండి.

అసలు ఏం జరిగిందో ఏమిటో ఏమాత్రం నాకు తెలీకుండా వుంది" అన్నాను. అలాగే రాస్తాలెండి అంది మంగళ. అన్నదేకాని ఏ ఉత్తరమూ రాయలేదు. బహుశా స్నేహితురాలిమీద అభిమానంకొద్దీ ఆమెను నలుగురి నోళ్ళలోనూ పడేయడం మంగళకు యిష్టంలేక ఉత్తరం రాయకపోవచ్చు.

పోనీ సీతాపతన్నా వుత్తరాలు రాస్తూవుంటే ఏ విషయమన్నా తెలుస్తూ వుండేది.

చదువు పూర్తయి తలా ఒక దారయిపోయాక ఓ మూడేళ్ళపాటు ఉత్తర ప్రత్యుత్తరాలు సాగుతుండేవి. ఇటీవలే ఓ ఏడాదిగా ఉత్తరాలు బాగా తగ్గిపోయాయి. అయిదారు నెలలనించి అసలేలేవు. బహుశా నామీద కోపం వచ్చుండాలి. వాళ్ళ పెళ్ళికి కారకుడ్నిగనుక, అదిలా బెడిసికొట్టింది కనుక అతనికి నామీద కోపం రావడం అసహజమేమీ కాదు. గొప్పకోసం పెద్దరికం వహించే వాళ్ళు చివాట్లకుకూడా సిద్ధపడాల్సిందే. నాటకంవేసి నాలుగు రాళ్ళు చేసుకుందామనుకునేప్పుడు చెప్పుల్ని ఏరుకోవడానికి కూడా ముందుకు రావాలి మరి.

సీతాపతి, అలకల వివాహంలో మాతోపాటు మరో ముద్దాయి సరస్వతి. అలకకు మంగళ ఎంతో సరస్వతీ అంతే. చదువుకునేటప్పుడు వాళ్ళు రూంమేట్సు. అందువల్ల సరస్వతి ద్వారా ఏమన్నా విశేషాలు తెలుస్తాయేమోనని, ఎప్పుడూ ఉత్తరమన్నా రాయనివాడ్ని పనిగట్టుకుని ఆవిడకి వుత్తరం రాశాను. వెంటనే సమాధాన మిచ్చింది సరస్వతి.

తనకీ చాలాకాలంగా వుత్తరాలు లేవట. పెళ్ళయ్యాక అనేకచోట్ల తిరగాల్సి రావడంవల్ల ఉత్తరాలు సరిగా అందక రాయడం ఆగిపోయిందట. ఆ మధ్య ఓసారి అత్తవారింటినించి వస్తోంటే రైల్లో ఓ చిన్న విశేషం జరిగిందట. పెట్టెలో ఎదురు బెర్తులలోవున్న అమ్మాయిలు యిద్దరు సీతాపతి కవిత్వం గురించీ, ఆయన చాలా చక్కగా వుత్తరాలు రాయడం గురించీ చాలాసేపు చర్చించుకోవడం విన్నదట. అందులో ఒకమ్మాయి తనకు ఆయన వుత్తరాలు రాస్తుంటారనీ, చాలా చక్కగా మళ్ళీమళ్ళీ చదువుకోవాలనిపించేంతగా రాస్తుంటారనీ చెప్పుకోవడం విన్నదట. ఆ విషయాలన్నీ రాస్తూ 'సీతాపతి ఉత్తరాలు

మాత్రం చాలా చక్కగా రాస్తాడు. మంచి స్నేహితుడాయన. ఆడా మగా స్నేహితులు ఆయనకు చాలామంది వున్నారు. వాళ్ళంటే ప్రాణాన్ని సైతం యిస్తాడు. అయితే వాళ్ళమీద చూపిస్తున్న అభిమానంలో, ఆ ఆరాధనలో వదో వంతైనా భార్యమీద చూపిస్తే ఈ కలతలు వుండి వుండకపోను' అని రాసింది.

ఎంతయినా స్నేహితురాలిని వెనకేసుకొచ్చింది. కావలసినవాళ్ళ తప్పులు కంటికి నలుసులు, పరాయివాళ్ళ లోపాలు భూతద్దంలో రూపాలు కదామరి!

ఇంతకీ ఏం జరిగిందో తేలీదు. ఒకసారి వెళ్ళొస్తేగాని విషయం అంతు బట్టేటట్టులేదు. భార్యా భర్తలిద్దరికీ సన్నిహిత మిత్రుడిగా యీ విషయంలో నేనేమన్నా తోడ్పడవచ్చేమోనని, ఈ బాధ్యత నామీద కూడా వుందికదాని, ఒకసారి వెళ్ళొద్దామనుకున్నాను.

అలా అనుకుంటూనే ఆర్నెల్లు గడిచిపోయాయి. ఈ లోపల రెండు మూడు ఉత్తరాలు రాశాను సీతాపతికి. అతని వ్యక్తిగత విషయాల జోలికి పోకుండా నా గురించే రాశాను. సమాధానం లేదు. కాకపోతే కొత్త సంవత్స రంలో మాత్రం గ్రీటింగ్స్ పంపిస్తూ నాలుగే నాలుగు లైనులున్న చిన్న ఉత్తరం రాశాడు. కొంత కాలంగా మనసంతా చికాకుగావుందనీ, ఉత్తరాలు రాయక పోయినందుకు ఏమీ అనుకోవద్దనీ, యిటుపై రాస్తూ వుంటాననీ రాశాడు. రాయడమైతే రాశాడుగానీ ఆ తర్వాత మళ్ళీ వుత్తరాలే లేవు. గ్రీటింగ్స్ ఏదో మొక్కుబడికి పంపినట్టు పంపించాడని నాకు కూడా కోపం వచ్చి అతని గురించి ఆలోచించడం మానుకున్నాను. దానికితోడు నా స్వవిష యాలు కూడా నన్ను యితరులను గురించి ఆలోచించనివ్వలేదు. నాలుగైదు నెలలు నేనూ, నా గొడవేతప్ప మరొకరి గురించి ఆలోచించే తీరుబడి లేక పోయింది.

ఒకసారి కొత్తగా వచ్చిన లైబ్రేరియన్ ఆశ్చర్యంగా సీతాపతి ప్రస్తావన తెచ్చింది. ఆ లైబ్రేరియన్ నెలరోజుల కిందటే మా ఇన్‌స్టిట్యూట్‌కి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చింది. ఓ రోజు పుస్తకం వొకటి తీసుకుని కార్డుమీద సంతకం పెట్టి

రాబోతోంటే "మీరేనా సీతాపతిగారి మిత్రులు. ఇక్కడ మీరు పనిచేస్తున్నట్టు ఆయన రాశారులెండి" అంది.

సీతాపతి మీకు తెలుసా?—అని అడగబోయి అడగడం మానేశాను. ఇది అసందర్భపు ప్రశ్న. తెలియకుండా వుత్తరం ఎందుకు రాస్తాడూ. మనసులోవున్న ప్రశ్న అదికాదు. ఇంతకీ ఆయన ఉత్తరం ఎప్పుడు రాశాడూ అని. ఆ ప్రశ్న నేను అడక్కుండానే ఆవిడ మాటల్లోనే దానికి సమాధానం దొరికింది.

"సీతాపతిగారు మీకు బాగా క్లోజ్ ఫ్రెండ్ అటగా. ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ అయ్యే సూచనలు వున్నాయని రాస్తే మీ గురించి రాశారు. మొన్న వచ్చిన వుత్తరంలో కూడా మీ ప్రస్తావన వుంది."

అసూయో, కోపమో తెలీదు, సీతాపతిని గురించి నాకు అట్టే వినాలని అనిపించలేదు. పుస్తకం తీసుకుని వచ్చేశాను.

వారం రోజుల తర్వాత పుస్తకాన్ని యిచ్చేద్దామని వెళ్ళినప్పుడు ఆవిడ ఓ ఉత్తరం యిచ్చి "ఇందులో సీతాపతిగారు మీ గురించి కూడా రాశారు, చూడండి, అంది ఆ ఎనిమిది పేజీల్లో నేనెక్కడ వున్నానో వెతుక్కుంటూ ఆమె పర్సనల్ లెటర్‌ని చదవడం సభ్యతకాదని ఆ వుత్తరం పట్టుకుని అలానే వుండిపోయాను.

"ఫరవాలేదు, చదవండి—సాహిత్య విషయాలే అన్నీ, చివరి పేరాలో మీ గురించి వుంది."

చివరి పేరాయే చూశాను.

"జీవితం చాలా నిస్తబ్దంగా గడుస్తోంది. ఏ ఉత్సాహమూ వుండడం లేదు. నిర్వికారంగా రోజులు దొర్లిపోతున్నాయి. కొంత కాలంపాటు యీ జీవితంలోంచి పారిపోదామనిపిస్తోంది. పరీక్ష పేపర్లు దిద్దాల్సిన పనొకటి వుంది. అదయిపోతే ఒంటరిగా దక్షిణ దేశమంతా తిరిగి వద్దామనుకుంటున్నాను. వెళ్ళేప్పుడో, వచ్చేప్పుడో హైదరాబాదులో దిగుతాను. మిమ్మల్నీ, రాజుబాబునీ కలుసుకోవచ్చు. అతన్ని చూసికూడా చాలాకాలమైంది. నేనంటే విపరీతమైన అభిమానం అతనికి. నేను గర్వంగా చెప్పుకోదగ్గ స్నేహితుడు........"

సీతాపతిని కోపగించుకోవటంలో అర్థంలేదు. అతనికి నామీద కోపం లేదు అభిమానమేతప్ప. ఉత్తరాలు రాయడం లేదని అతనిమీద కోపం పెంచు కోవడం నా అల్పత్వమే. నాకు రాయడానికైనా అతనికి పెద్దగా ఆసక్తికర మైన విషయాలు యేముంటాయి. సాహిత్యం గురించి నాకేమీ తెలీదు—సొల్యూషన్లూ, కెమికల్సూ తప్ప. ఎంతసేపూ "ఇక్కడ నేను క్షేమం. అక్కడి నీ క్షేమసమాచారాలు తెలియజెయ్యి" అనే రాయాలి. అందుకని బద్ధకించి వుండొచ్చు. ఆ మాత్రందానికి యింత శిక్ష? నావల్ల కలిగిన ప్రత్యక్షమైన బాధకితోడు యీ పరోక్షమైన మనస్తాపంకూడానా?

"సీతాపతిగారి విషయాలన్నీ మీకు తెలుసుకదూ!" అది ఆమె.

తెలుసన్నట్టు తలూపాను.

"పాపం! ఆయనలాటి వారికి రావలసిన కష్టాలు కావవి. చీమకన్నా అపకారం తలపెట్టని మనిషి. అంత మంచి మనిషికి అలాటి భార్య దొరకడ మేమిటండీ!"

ఇంతకీ ఆమె యెలాటి భార్య? ఒకవేళ ఆయన గౌరవాన్ని మంట గలిపే పనేమన్నా చేసిందా! నా అజ్ఞానాన్ని తెలియజెప్పకోదలచలేదు. ఆవిడ ద్వారానే చెప్పిద్దామనుకున్నాను. "నిజమే—పాపం! అంత మంచివాడికి అలాటి భార్య దొరకటం ఆశ్చర్యమే."

"చదువుకున్నదై వుండికూడా భర్తని ముప్పొద్దులా సాధించే మనిషిని నేనెక్కడా చూళ్ళేదు. చిత్రం. వాళ్ళది ప్రేమ పెళ్ళటగా! అంత కలవని మనస్తత్వాలవాళ్ళు యెలా దగ్గరయ్యారో మరి!"

ఎలాటి భార్యో అన్నదానికి సమాధానం దొరికింది. ఇంతకీ ముప్పొద్దులా భర్తని సాధించే భార్యన్నమాట! ఈ మాత్రం దానికే నా మనసు వంకరపోయి, వక్రంగా ఆలోచించింది. పాపిష్టి మనసు.

"ఆ మధ్య మా పెదనాన్న కొడుకు పెళ్ళికని విశాఖపట్నం వెళ్ళినపుడు వో రోజు వీలుచూసుకొని సీతాపతి గారింటికి వెళ్ళాను. పనిగట్టుకుని వాళ్ళాయన గురించని స్నేహితురాలు వస్తే కనీసం అతిథి మర్యాదగా కాఫీనీళ్ళన్నా ఇవ్వ కుండా మమ్మల్ని అలా వొదిలేసి తోటి లెక్చరర్ యెవరోవస్తే కలిసి సినిమాకి

వెళ్ళిపోయింది వాళ్ళాపిడ. భార్య ప్రవర్తనకి సీతాపతిగారు చాలా నొచ్చుకున్నారు" అంది లైబ్రేరియన్.

"ఎవరా లెక్చరర్ ?" ఆయన పేరు ?"

"ఆయన కాదండీ... ఆవిడే పేరు సరోజో, జలజో జ్ఞాపకంలేదు. అలకగారితో పాటు అదే కాలేజీలో హిస్టరీ లెక్చరర్‌గా పనిచేస్తోందట !"

మనసు మళ్ళీ తొందరపడి పోయింది. ఇంత కంగారేమిటి నాకు. నా ఆలోచనలకి నాకే సిగ్గేసింది.

"ఆరోజునండీ ఆయన నిజంగా యేడ్చారంటే నమ్మండి. ఆయన స్వవిషయాలు నాకు తెలీవు. అంతకుముందు ఆయన్ను కలుసుకోలేదు కూడాను. అదే తొలిసారి కలుసుకోవడం ఉత్తరాల పరిచయం ఉందనుకోండి. అలాటిది ఆ కాస్త పరిచయంతో ఆయన తన విషయాలవీ చెప్పుకుని కళ్ళనీళ్ళు పెట్టుకున్నారంటే పాపం ఆయన ఎంతగా ఆత్మీయభిమానాలకు దూరమైపోయాడో అర్థమవుతోంది" అంది ఆవిడ తిరిగి.

పాపం ! సీతాపతి పరిస్థితి యిలా అయిపోయిందంటే చాలా బాధ కలిగింది నాకు. పువ్వులాటి మనసు అతనిది. ఎంతగా అతను బాధపడితేగాని, యెంతగా అనురాగానికి దూరమైపోతేగాని యిలా తన సంగతుల్ని మరొకరి ముందు చెప్పడానికి సాహసిస్తాడు !

లైబ్రేరియన్ చాలా విషయాలు చెప్పింది.

ఒకసారి సీతాపతి బెంగుళూరుకు వెళ్ళి పర్సు పోగొట్టుకున్నారట. అర్జంటుగా రెండొందలు టి.యం.ఒ. చెయ్యమని భార్యకి టెలిగ్రాం యిస్తే పంపించలేదట. తెలిసిన ఆవిడ యెవరో బెంగుళూరులో వుంటే ఆవిడ దగ్గర డబ్బు తీసుకొని వచ్చారట.

మరోసారి తోటి లెక్చరర్ ఒకాయన కొత్త స్కూటర్‌ని నాలుగు నెలలు మాత్రమే వాడి అమ్మేయబోతుంటే సీతాపతి కొందామనుకున్నారట. డబ్బు చాలకపోతే ఆవిడచేత కూడా వాళ్ళ కాలేజీలో లోన్‌కి అప్లయ్ చెయ్యమన్నారట. కానీ ఆవిడ చేసిందికాదట.

ఇంకోసారి కాలేజీలో తనతో చదువుకున్న అమ్మాయి డేన్సరుగా మంచి పేరు ప్రతిష్ఠలు తెచ్చుకుని సినిమాలలో ప్రవేశించబోతుంటే ఆవిడ గౌరవార్థం పూర్ణా హోటలులో సీతాపతి పార్టీ యిచ్చినందుకు హాళ్ళావిడ వారం రోజులు నానా రభస చేసిందట

ఆ మధ్య సీతాపతి మేనత్తకూతురు ఎంతో అభిమానంతో నాలుగు రోజులు వుండి వెళ్దామని వస్తే భార్య సరిగా ఆదరించలేదట.

ఆదివారాలలోనూ, సెలవు రోజులలోనూ స్నేహితులతో కబుర్లు చెబుతూ కూచోడం సీతాపతిగారికి అలవాటు. అది ఆమెకు నచ్చదట. ఏనుందని చెప్పి తెలివిగా యే స్నేహితురాలి దగ్గరికో, చుట్టాలింటికో, సినిమాకో వెళ్ళి పోతుందట.

"ఇలాటివి చాలా సంఘటనలు చెప్పుకొచ్చారండి. నా మట్టుకు నాకు ఆవిడ సీతాపతిగార్ని యేమాత్రం ఖాతరు చేస్తున్నట్టు అనిపించలేదు. ఇద్దరూ కొద్దినెలల వ్యవధిలో ఉద్యోగంలో చేరినా, ఆవిడ పనిచేస్తున్నది ప్రయివేటు కాలేజీ కావటంవల్ల ప్రమోషన్ త్వరగా వచ్చింది. ఆయనకన్నా నాలుగు రాళ్ళు యెక్కువ తెచ్చుకొంటున్నానని ఆమెకు యెక్కడలేని గర్వం. ఆ సంగతిని ఆమె రోజుకు పదిసార్లన్నా బైటపెట్టుకుంటుందట" అంది లైబ్రేరియన్.

ఆవిడ చెప్పినదాన్నిబట్టి సీతాపతిని అలక చాలా చిన్నచూపు చూస్తోం దని అర్థమైంది. సీతాపతి చాలా మెతకమనిషి. అభిమానవంతుడు. చిన్న విషయానికే అమితంగా బాధపడిపోతాడు. అలాటివాడు ఇంత పెద్ద విషయాన్ని యెలా తట్టుకోగలుగుతున్నాడో ఆశ్చర్యమే. అలక, భార్యగా కాకపోయినా కనీసం స్నేహితురాలిగానన్నా ప్రవర్తించకపోవటం యేం బాగాలేదు.

ఒకసారి వెళ్ళి ఆమెను గట్టిగా మందలిద్దామనిపించింది. ఆలస్యం చేస్తే పరిస్థితి మరీ విషమించొచ్చు.

వారం రోజులు తిరక్కుండానే సీతాపతి దగ్గరకి బయలుదేరాను. కాలేజీలకు సెలవులే గనుక యిద్దరూ యింటిదగ్గరే వున్నారు. పైగా టెలిగ్రాం కూడా యిచ్చాను.

అలకలో నాకు యే మార్పూ కనిపించలేదు. వెనక యెలావుండేదో యిప్పుడూ అలానేవుంది. అదే పలకరింపు. అదే కలుపుగోలుతనం.

సీతాపతిలో మాత్రం మార్పు స్పష్టంగా తెలుస్తోంది. ఆ ఉత్సాహమూ, ఆ చైతన్యమూ అతనిలో ఇప్పుడు లేవు. చాలా స్తబ్దంగా, నిర్లిప్తంగా ఉన్నాడు. అతన్ని చూస్తే నిజంగానే జాలేసింది. బాధకూడా కలిగింది. అతన్ని యిలాటి స్థితికి తెచ్చిన అలకమీద యెంతైనా కోపం వచ్చింది. పైపెచ్చు యేమీ జరగ నట్టు నిర్విచారంగా ఆమె మెలగడం చూస్తే ఆమెమీద అసహ్యంకూడా పుట్టు కొచ్చింది.

అసలు నన్ను చూడగానే "యేమిటి! రాజుబాబుగారే. ఎంత కాలానికి దయకలిగింది. దారితప్పి రాలేదుకదా!" అని యెదురొచ్చి పలకరించి హడా వుడి చేసింది. భోజనాల దగ్గరకూడా "ఇలా మీరు మొహమాటపడితే వొప్పు కొనేదిలేదు. వెనక సింహాచలానికి పికినిక్‌కి వెళ్ళినపుడు నా చేతివంట రుచి మరిగి పులిహోరని కనీసం అరడజనుసార్లన్నా మారు అడిగి వేయించుకు తిన్నారే. అది మర్చిపోయారా. ఇప్పుడేదో పరాయివాళ్ళ దగ్గరకు వచ్చినట్టు ఆ మొహమాటం యేమిటండీ" అంది. చాలా సరదాగా కబుర్లు చెప్పింది. నవ్వించింది. విచిత్ర మేమంటే సీతాపతికి మాటిమాటికీ యూనివర్సిటీ రోజులు జ్ఞాపకంచేసి ఆనాటి విశేషాలు చెప్పి నవ్వుతూ ఎక్కడలేని అనురాగాన్నీ అతనిమీద కుమ్మరించింది! ఆమె ప్రవర్తన చూస్తే, వాళ్ళ గురించి నేను విన్నది నిజం కాదేమో అన్న అనుమానం కూడా నాకు కలక్కపోలేదు. అయితే సీతాపతి వాలకం చూశాక అలక ప్రవర్తన కేవలం నటనమాత్రమే అనిపించింది. పైగా యిక్కడి సంగతులేమీ తెలియనివాడ్ని కాదుగదా.

సాయంకాలం సీతాపతీ, నేనూ ఊళ్ళోకి బయలుదేరాం. బీచ్ దగ్గరికి నేను దారితీశాను. ఆట్టే జనం లేనిచోట దూరంగా వెళ్ళి కూచున్నాం. మరొకప్పుడయితే సముద్రాన్ని చూస్తూ గంటలకొద్దీ మౌనంగా గడిపేసే వాళ్ళం కాని యిప్పుడా వోపికలేదు. సీతాపతిని కదిపి విషయమేమిటో తెలుసుకోవాలని ఆతృతగా వుంది.

"నువ్వు చాలా మారిపోయావోయ్ సీతాపతీ! శారీరకంగానూ, మానసికంగానూ నీలో చాలా పెద్దమార్పే వొచ్చింది" అన్నాను.

సీతాపతి వేదాంతిలా అంటీఅంటనట్టు అతి నిర్లిప్తంగా నవ్వాడే తప్ప యేం మాట్లాడలేదు.

"సీతాపతీ! నన్ను పరాయివాడిగానే చూస్తున్నావా? నీకు నేనేమీ కానా? నానుంచి దాచే రహస్యాలుకూడా నీకు వున్నాయా? చెప్పు సీతాపతీ."

"లేదు రాజుబాబూ నీతో చెప్పుకోకపోతే మరెవరికి చెప్పుకుంటాను. నీ దగ్గరా నేను దాచుకొనేది?"

రెండు గంటల సేపు కూచున్నాం అక్కడ. సీతాపతి చాలా విషయాలు చెప్పాడు. ఏమీ దాచుకోలేదు. జీవితంనిండా అశాంతి యెలా పేరుకుపోయిందీ, తనంటే అలకకు యెంత అలుసైపోయిందీ, తన వ్యక్తిత్వాన్నీ, అభిరుచులనూ అలక యెలా చిన్నచూపు చూస్తున్నదీ, తనెలా వొంటరిగా బతుకుతున్నదీ— అన్నీ చెప్పుకొచ్చాడు. చీకటిపడి అతని ముఖం స్పష్టంగా కనిపించకపోయినా అతని కంఠం బొంగురుపోవటం గుర్తించాను.

పాపం! సున్నితమైన మనిషి. ఈ ప్రభంజనాన్ని తట్టుకోలేకపోతున్నాడు. చిన్నపిల్లాడిని వోదార్చినట్టు వోదార్చి ధైర్యం చెప్పాను. నిజమే. లైబ్రేరియన్ చెప్పినట్టు అతను ప్రేమకీ, అభిమానానికీ మొహం వాచిపోయాడు.

ఇంటి కొచ్చేసరికి బాగా ఆలస్యమైంది.

ప్రయాణపు బడలికవల్ల ఆ రాత్రి వేగంగానే నిద్రపోయాను. ఉదయం లేవడం కూడా ఆలస్యమైంది.

పొద్దున్న పదిగంటలవేళ స్టేషన్‌కి వెళ్ళొస్తానని, యెవరితో కలుసుకోవాలని చెప్పి సీతాపతి వెళ్ళాడు. నేనుకూడా వెంట వెళ్దామనుకొన్నాను కాని అతను యే పనిమీద వెళ్తున్నాడో లెమ్మని ఆగిపోయాను. అదీగాక వాళ్ళ కుటుంబ విషయాలవీ అలకతో మాట్లాడడానికి యిదే తగిన సమయం అనిపించింది.

ఆవిడ లోపల వంటపనిలో మునిగివుంది. వంట పూర్తిచేసుకునివస్తే తీరికగా మాట్లాడొచ్చు.

కాలక్షేపానికి పుస్తకం యేదన్నా చదువుదామని సీతాపతి డ్రాయరుమీది పుస్తకాలు తిరగేస్తోంటే పైనేవో ఉత్తరం కనిపించింది. పరాయివాళ్ళ ఉత్తరాలు చదవటం సభ్యతకాదని తెలుసు కానీ ఆ ఉత్తరం ఆడాళ్ళ హేండ్ రైటింగులో వున్నట్టనిపించి ఉత్సుకతకొద్దీ తీసి చదివాను. మూడొంతులు ఉత్తరం అంతా కవిత్వానికి సంబంధించే వుంది. మామూలు కథలూ, నవలలే నాకు అర్థంకావు. కవిత్వం సరేసరి అసలే అర్థంకాదు. ఉత్తరం చివరి భాగం మాత్రం అర్థమైంది. సోమవారం హౌరా-హైదరాబాదు ఎక్స్‌ప్రెస్‌లో సామర్లకోట వెళుతున్నాననీ, వీలయితే వైజాగ్ స్టేషన్‌కు రావలసిందనీ వుంది. అడుగున పేరు చూశాను. ప్రభ అట. ఆ ఉత్తరంపైన శ్రీకాకుళం ఊరిపేరూ, తేదీ వున్నాయి.

బహుశా ఈవిడ గురించే గాబోలు సీతాపతి స్టేషనుకు వెళ్ళాడు.

అలక కాఫీ పట్టుకొచ్చింది. "ఇది రెండో ట్రిప్. ఇవ్వాళ యెలాగూ మీకు భోజనం ఆలస్యమయ్యేట్టుంది. ఆయన స్టేషన్‌కి వెళ్ళినట్టున్నారుగా. ఈ రైళ్ళు కరక్టు టైమ్‌కి యెప్పుడూ రావు అయన వచ్చేసరికి వొంటిగంట దాటుతుందేమో" అంది.

అయితే ఈవిడకి కూడా తెలుసన్నమాట యీ ప్రభ యెవరో.

"ఎవరండీ యీ ప్రభ ?"

"ఆవిడా.... మీకు తెలిసేవుంటుంది ప్రభని—పత్రికల్లో కథలవీ రాస్తుంది. మావారి కవిత్వం అంటే ఆవిడకి చాలా యిష్టం. మావారి ఫేన్."

"మీవారి గొప్పతనం నాకూ—మీకూ తప్ప మిగిలిన వాళ్ళందరికీ తెలుసన్నమాట."

కావాలనే వో విసురు విసిరాను అదామె అర్థం చేసుకొనే వుండాలి. అందుకే ఆమె నవ్వులో ఆ విరుపు.

ఇదే తగిన సమయం వాళ్ళ కుటుంబ విషయాలు కదపటానికి.

"ఏమిటండీ విశేషాలు. మీరిద్దరూ అంతలా మారిపోయారేమిటి ? సీతాపతైతే మరీనూ. ఆ చలాకీ, ఆ ఉత్సాహం యేమైపోయాయ్. గుర్తుపట్టటమే కష్టమైంది. అంత దిగులుగా కనిపిస్తున్నారేమిటి ?" అన్నాను.

"భలేవారే! మాకు దిగులేమిటండీ—హాయిగా వుంటేనూ. అయిదేళ్ళ తర్వాత చూస్తున్నారుగా. అందువల్ల అలా అనిపిస్తోంది" అంది ఆమె అతి సాధారణంగా.

"మీరు అబద్ధం ఆడుతున్నారని మీ ముఖమే చెప్తోంది. నాదగ్గర మీరేదో దాస్తున్నారు" రెట్టించాను.

"మీరు వూరికే వూహించుకుంటున్నారు. మావారిలాగా మీరుకూడా కవిత్వం రాస్తున్నారేమిటి!" అంది నవ్వుతూ. విషయం మార్చేసి నా స్వవిషయాలు అడగడానికి ప్రయత్నించిందిగాని అలా కప్పదాటు వేయనివ్వ లేదు నేను.

"మిమ్మల్ని అప్తుల్లా భావించుకుంటున్నా మీరు మాత్రం నన్ను పరాయి వాడిగానే చూస్తున్నారు. అప్తుల దగ్గర రహస్యాలనేవి వుండడానికి వీల్లేదు. సీతాపతి కూడా యింతే. మనసులో మథన పడిపోవడమేతప్ప బయటకేమీ చెప్పడంలేదు."

"అలా మీరెప్పుడూ అనుకోవద్దు. మీరంటే మా యిద్దరికీ అమితమైన గౌరవం వుంది. వారు మిమ్మల్ని యెప్పుడూ గుర్తుచేసుకొంటూనే వుంటుం టారు. ఎన్నోసార్లు అన్నారు. ఒకసారి హైదరాబాదు వెళ్ళి రాజుబాబును చూసొద్దామని. కాని—నేనే యెప్పటికప్పుడు వాయిదావేస్తూ వచ్చాను."

అలకలో యింతవరకు నేను గుర్తించని వో విశేషం చటుక్కున మెరుపులా మెరిసింది. ఎన్ని అభిప్రాయ భేదాలువున్నా, యెన్ని గొడవలు పడుతున్నా సీతాపతిని వేరుచేసి చూపడంలేదు. ఆశ్చర్యంగానే అనిపించింది నాకు.

ఖాళీ కాఫీగ్లాసు తీసుకొని వెళ్ళపోబోయిందిగాని "వెళ్ళుదురుగాని కాస్సేపు కూచోండి, ఇవాళ యెలాగూ భోజనాలు ఆలస్యమేగా" అని మొహ మాటపెట్టి, ఇరకాటంలో పడేశాను. కూర్చోక తప్పలేదు ఆమెకు.

"మీరు చాలా తెలివిగా అసలు విషయం దాటేయ్యాలని చూస్తున్నారు. ఇక్కడి సంగతులన్నీ నాకు తెలుసు. అందుకనే యిలా అకస్మాత్తుగా

వచ్చాను. మీరు ప్రమాణంచేసి చెప్పండి. మీరూ, సీతాపతీ సుఖంగా సంసారం చేస్తున్నారని, యే గొడవలూ లేకుండా వుంటున్నారని."

ఆమె వో క్షణం తేరిపారచూసి పకపకా నవ్వుతూ "అదా సంగతి. ఇంత అకస్మాత్తుగా వస్తే యేమిటో అనుకున్నాము—మామీద అభిమానంతో కాదన్నమాట. పోనీలెండి—యిలాగన్నా చూడ్డానికి వచ్చారు. ఇంతకీ యింత పచ్చి అబద్ధాన్ని మీ దగ్గరకి మోసుకొచ్చింది యెవరండీ! అయినా మా గురించి యింతగా తెలిసినవారు మీరెలా నమ్మారట!"

లాభంలేదు. ఎక్కడనించి మొదలెట్టినా చివరకి పక్కకే లాక్కుపోతోంది ప్రసంగాన్ని. యెంత తరచితరచి అడిగినా చెప్పలేదు. ఇద్దరిమధ్యా యే కలతలూ లేనట్టే మాట్లాడుతోంది. పైగా సీతాపతిని కూడా తనతోనే కలుపుకుని వెనకేసుకొచ్చి మరీ మట్లాడుతోంది. గతరోజు సీతాపతి స్వయంగా తన విషయాలు చెప్పకోకపోతే నేనుకూడా పొరపాటు పడ్డాననే అనుకునేవాణ్ణి. గిట్టని వాళ్ళెవరో ప్రచారం చేశారని భావించేవాడిని. అంత తెలివిగా, అతి చాకచక్యంతో నటించింది మరి!

ఒక్కొక్కప్పుడు నటనకూడా జీవితానికి అవసరం.

కానీ—

ఆలోచిస్తున్నకొద్దీ—అలకలో దోషాలుకన్న సుగుణాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

ఔను. అలక చాలా పెద్దమనిషి తరహాలో ప్రవర్తించింది. ఇంతవరకు ఆమెను ఇతరుల దృష్టితో చూశాను. అందరిలాగే ఆమెను తప్పుపట్టాను. కాని యిప్పుడనిపిస్తోంది ఆమె సీతాపతికన్నా యెన్నోరెట్లు మెరుగని.

సీతాపతి, కనిపించిన ప్రతి మనిషి దగ్గరా తన ఇంటిగుట్టు బట్టబయలు చేశాడు. వాళ్ళ సానుభూతి పొందాలని తన కథ చెప్పుకుని యేడ్చాడు. తననూ, తన భార్యనూ విడివిడిగా ఫోకస్‌చేసి చూపించాడు. గోరంతల్ని కొండంతలు చేశాడు.

కాని ఆమె అలా ప్రవర్తించలేదు. తనూ, తన భర్తా వొకటే అని చూపించింది. మరీ దగ్గరి స్నేహితుల యెదుటకూడా ఇంటిగుట్టు బయటపెట్టలేదు. భర్త గురించి యెక్కడా చెడుగా చెప్పలేదు. అన్నిటినీ తనలోనే గుంభనంగా

దాచుకొంది. సంసారానికి కావలసిన ముఖ్యమైన లక్షణం యేదో ఆమెకు తెలుసు. వ్యక్తి విలువకన్న సమిష్టివిలువ ప్రధానమైనది. అదామె గుర్తించింది

అలకను ముందుగానే చెడ్డదానిగా ఊహించుకోవడంవల్ల సీతాపతి చెప్పిన ప్రతి సంఘటనలోనూ తప్పంతా అలకదే అనిపించింది. ఇప్పుడు ఆవిడ మంచితనం యెదుట పెట్టుకొని చూస్తున్నప్పుడు సీతాపతే దోషిగా కనిపిస్తున్నాడు.

నిజమే. సరస్వతి రాసినట్టు సీతాపతి తన స్నేహితులమీద చూపించే అభిమానంలో పదోవంతు భార్యమీద చూపించివుంటే యిలాటి పరిస్థితి ఏర్పడి వుండేదికాదు. భార్యను భార్యగా గాకపోయినా కనీసం స్నేహితురాలిగానన్నా చూడలేకపోయాడు. ఎంతసేపూ తన వ్యక్తిత్వాన్నే పరిపోషించుకున్నాడుతప్ప భార్య వ్యక్తిత్వాన్ని ఏమాత్రం పరిగణించలేదు. అలకకూడా స్త్రీయే అనీ, ఆమెకూడా రాగద్వేషాలకు అతీతురాలు కాదనీ గుర్తించకుండా తన దారేదో తనదేనన్నట్టు ప్రవర్తించాడు. ఆమెకు తద్వారా తీరని మనస్తాపాన్ని కలిగించాడు.

తన స్నేహితురాలు లైబ్రేరియన్ వచ్చినపుడు కాఫీనీళ్ళన్నా ఇవ్వకుండా భార్య బయటికి వెళ్ళిపోయిందని బాధపడ్డ సీతాపతి, ప్రాణస్నేహితుణ్ణి పనిగట్టుకుని వెళ్తే నా బాగోగులు చూడకుండా తన పాతకురాలి గురించని స్టేషన్‌కు వెళ్ళిపోవడంమాత్రం యేం బావుంది. అది తప్పయినప్పుడు యిది కూడా తప్పే. ఆలోచిస్తే సీతాపతి భార్యమీద చెప్పిన ప్రతి లోపమూ అతన్నే దోషిగా నిర్ణయిస్తోంది. ఈ విషయం అతని ముఖంమీద చెప్తే భరించలేడు. ఊరెళ్ళి వో పెద్ద ఉత్తరమే రాద్దామని నిర్ణయించుకున్నాను.

సీతాపతి ఇంటికి వచ్చేసరికి రెండయ్యింది.

"ఇంత ఆలస్యమేమిటోయ్. ఆ రైల్లో అనకాపల్లివరకూ వెళ్ళి మరో రైల్లో తిరిగొచ్చావేమిటి!" అన్నాను నవ్వుతూ.

సీతాపతి ఆశ్చర్యపోయాడు. ఓ నిమిషం అలాగే కళ్ళను యింతింత చేసుకొని చూశాడు. అతను యెందుకలా చూశాడో నాకు అర్థంకాలేదు.

ఆవిడకి మాత్రం అర్థమైనట్టుంది, మెల్లగా నవ్వుకుంది. ఆమె నవ్వు చూశాక అర్థమైంది—సీతాపతి నిజంగా అనకాపల్లి వెళ్ళివచ్చాడని!

మర్నాడు ఉదయం నేను బయలుదేరి వచ్చేశాను. భార్యాభర్తలిద్దరూ స్టేషనుకువచ్చి వీడ్కోలు యిచ్చారు. బండి యెక్కేముందు భర్తతో అలక—

"చూశారా! రాజుబాబుగారు యిక్కడ మనమేదో పోట్లాడేసుకుంటున్నామనీ, మనమధ్య అగాధాలు యేర్పడిపోయాయనీ లేనిపోని ఊహలు పెట్టుకొని వచ్చారు. అదేంలేదు స్వామీ అంటే నమ్మడంలేదు, మీరన్నా చెప్పండి" అంది నవ్వుతూ.

సీతాపతి నాకు యింటి విషయాలు చెప్పివుంటాడని ఆమె కలలోకూడా వూహించివుండదు. ఊహించివుంటే యిప్పుడు యీ విధంగా అని, తన భర్తను నా యెదుట దోషిగా నిలబెట్టి వుండేది కాదు.

(1969)

★